1న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధిహామీ వేతనదారుల సమస్యలపై జులై 1న మండల కార్యాలయం వద్ద చేపట్టబోయే ధర్నాలో వేతనదారులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిహామీ పనిచేసి 6 నుండి 7 వారాలు గడుస్తున్నప్పటికీ వేతనదారులకు వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. ఈ చట్టంలో పనిచేసిన 14 రోజులకే బిల్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ వేతనదారులకు సక్రమంగా బిల్లులు అందడంలేదన్నారు. ఉపాధి వేతనాలు సక్రమంగా అందాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించి, పారా, గుణపాం, మెడికల్ కిట్లు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ జులై 1న ధర్నా తలపెట్టినట్టు తెలిపారు. ఈ ధర్నాలో వేతనదారులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచాచ్చరు.

షాపు అద్దెపై కౌన్సిల్లో దుమారం

- వసూలు చేయకపోతే ఎసిబికి ఫిర్యాదు
- సామాజిక మరుగుదొడ్డి కూల్చివేత పై చర్యలేవీ?
- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని 20 నెంబర్ షాపు అద్దె గోల్ మాల్ వ్యవహారంపై కౌన్సిలర్లు ముక్తకంఠంతో ధ్వజమెత్తారు. ఛైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. షాపు నెంబర్ 20లో అనేక ఏళ్లుగా ఉంటున్న యజమాని నుంచి ఎందుకు అద్దె డబ్బులు వసూలు చేయలేదని కౌన్సిలర్లు గిరిరఘు, రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి ప్రశ్నించారు. 2017 నుంచి తాను ఆ షాపులో ఉంటున్నానని యజమాని స్వయంగా మున్సిపల్ అధికారులతో కౌన్సిలర్లు పరిశీలనకు వెళ్లినప్పుడు చెప్పారని తెలిపారు. షాపు ఆయనకు కేటాయించినట్లు రూ.10వేలు చెల్లింపునకు సంబంధించిన రశీదు కూడా ఉందని చెప్పారు. రూ.11 లక్షలు షాపు యజమాని నుంచి వసూలు చేయాల్సి వుందని, ఎందుకు తాత్సారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనికి సమాధానం చెప్పడానికి మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులు, ఆర్ఐ శ్రీనివాసరావు నీళ్లు నమిలారు. షాపు అద్దె వ్యవహారంపై విచారణ జరిపినట్లు ఆర్ఐ శ్రీనివాసరావు చెప్పారు. విచారణలో ఏం తేలిందని నిలదీయగా విచారణాధికారి, టిపిఒ పద్మావతి మాట్లాడుతూ షాపు అద్దెకిచ్చినట్లు రికార్డుల్లో చూపించలేదని చెప్పారు. దీంతో కౌన్సిలర్లంతా భగ్గుమన్నారు. షాపు అద్దె విషయంలో కుంభకోణం జరిగినట్లు తెలుస్తోందని, అధికారులే బాధ్యత వహించాలని చెప్పారు. షాపు యజమాని నుంచి అద్దె డబ్బులు వసూలు కోసం ఆయనకు నోటీసు జారీ చేయాలని, లేకపోతే ఎసిబికి తామే ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని గుమడాంలో మున్సిపల్ పాఠశాల పక్కన ఉన్న సామాజిక మరుగుదొడ్డిని ఎవరు కూల్చారో చెప్పాలని టిడిపి కౌన్సిలర్లు వి.హర్షవర్ధన్, టి.లక్ష్మీజీ, కె.వరలక్ష్మి డిమాండ్ చేశారు. రూ.3.5 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్డి కూల్చివేతపై ఎందుకు ఫిర్యాదు చేయలేదని వారు నిలదీశారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విచారణ జరుగుతుందని మేనేజర్ చెప్పారు. టిడిపి కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలకు వైసిపి కౌన్సిలర్లు కూడా మద్దతు పలికారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

కమిషనర్‌పై ధ్వజం

మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణిపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. కమిషనర్ ప్రసన్న వాణి కార్యాలయంలో ఎప్పుడు ఉండేవారో, లేరో తెలిసేది కాదన్నారు. సమస్యలపై ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని చెప్పారు. ఆమె సొంత కారులో తిరుగుతున్నప్పుడు మున్సిపాలిటీ కారు అద్దె అలవెన్సులు ఎందుకివ్వాలని వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

మౌనం వహించిన చైర్‌పర్సన్

మున్సిపల్ సమావేశం ఆద్యంతం చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ మౌనం వహించడం చర్చనీయాంశమైంది. కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పారు. కానీ నోరు మెదపలేదు.

కార్మికుల జీతాలు చెల్లించలేని దుస్థితి బాధాకరం

ఒకప్పుడు జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన మున్సిపాలిటీలో ఈరోజు పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితి రావడం బాధాకరం. పారిశుధ్య కార్మికులు పనిచేయకపోతే పట్టణ ప్రజలు పరిశుభ్రత వాతావరణంలో ఉండలేరు. అసలే వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా పడుతున్నాయి, ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు సమ్మె చేస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. శనివారం మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె హాజరయ్యారు. తొలుత ఆమెకు చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరిరఘు, గొర్లి వెంకటరమణ, టిడిపి కౌన్సిలర్లు కొనిసి వరలక్ష్మి, వైదేహి కృష్ణారావు, ఇంఛార్జి కమిషనర్ శ్రీరామ్మూర్తి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పారు. అనంతరం మంత్రి సభ్యులందరికీ అభివాదం చేస్తూ వారి సీట్ల వద్దకు వెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు అనూహ్య మెజారిటీతో తనను గెలిపించారని, రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరానని, దీనికి ఆయన అంగీకరించారని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. తాను రాష్ట్రానికి మంత్రినైనా నియోజకవర్గ ఆడపడుచునేనని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తన వద్దకు ఎప్పుడొచ్చినా సహకరిస్తానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధులు కూడా అందుబాటులో ఉంచలేదని చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా వుండేందుకు ఆసుపత్రి వద్ద ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సౌమ్య జోస్ఫిన్

రాజీయే రాజమార్గం : జిల్లా జడ్జి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాజీ మార్గమే శ్రేయస్కరమని జిల్లా మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్ఫిన్ అన్నారు. స్థానిక జిల్లా కోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో మేజిస్ట్రేట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మేజిస్ట్రేట్ మాట్లాడుతూ లోక్‌అదాలత్ అనేది ప్రత్యామ్నాయ వివాద పరిష్కారంలో ఒక భాగమని, ఇది న్యాయస్థానంలో వ్యాజ్యానికి ముందు పెండింగ్‌లో ఉన్న వివాదాలు, కేసులను సామరస్యంగా పరిష్కరించుకుని రాజీ చేసుకునేలా చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కక్షిదారుల కోసమే ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నంత కాలం కక్షిదారులు వాయిదాలకు రావాలని పేర్కొన్నారు. ఎంతో ఖర్చు, ఆరోగ్యం, సమయం వృథా అవుతున్నాయని భావించి కక్షిదారుల శ్రేయస్సు కోసం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఒక్కసారి కోర్ట్ సమక్షంలో రాజీ కుదుర్చుకున్నాక మళ్ళీ అదే విషయంపై ఏ కోర్టులోను కేసు వేసే అవకాశం ఉండదని కక్షిదారులతో అన్నారు. కేసుల్లో రాజీ చేసుకున్నాక ఒక సహృద్భావ వాతావరణం కల్పించాలని కక్షిదారులను మేజిస్ట్రేట్ కోరారు. ఇరువురి అంగీకారంతోనే కేసుల్లో రాజీ చేయడం జరుగుతోందన్నారు. మొత్తం 139 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. వీటిలో ప్రొనోట్ కేసులు -7, విద్యాశాఖ పిటిషన్లు-1, భూతగాదా కేసులు - 4, సివిల్ కేసులు-12, ఐపిసి కేసులు 109, ఎన్.ఐ యాక్ట్ కేసులు 3, ఎక్సయిజ్ కేసులు-3ను ఇరుపక్షాల సమక్షంలో పరిష్కరించామని మెజిస్ట్రేట్ వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాఘవేంద్ర, జి.లక్ష్మణ్ రావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్పంచ్ రాజీనామా

సీతానగరం : మండలంలోని బాలకృష్ణాపురం సర్పంచ్ నడిమింటి సుశీల తన రాజీనామాన్ని ఎంపిడిఒ కె.ఈశ్వరరావుకు శనివారం అందజేశారు. ఈ రాజీనామా పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని ఎంపిడిఒ తెలిపారు.

ఆక్రమణదారులను వదిలిపెట్టేది లేదు

పాలకొండ నగర పంచాయతీ రూపురేఖలు మారాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

భూ ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హెచ్చరించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకొండ పట్టణంలో ప్రభుత్వ భూములు ఇష్టానుసారంగా కబ్జాలకు గురయ్యాయని, దీనిపై లోతుగా దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేసేదే లేదని అన్నారు. ప్రజా అవసరాలకు భూములు దొరకడం లేదు కానీ కబ్జాదారులకు మాత్రం భూములు ధారదాత్తం చేస్తారంటూ రెవెన్యూ అధికార యంత్రాంగంపై మండిపడ్డారు. దీనిపై ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి ప్రభుత్వ భూములు గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఎక్కడ్కెనా ఆక్రమణలుంటే వెంటనే గుర్తించి తొలగించాలన్నారు. అదే విధంగా జగనన్న కాలనీల్లోనూ భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఎకరాకు రూ.10 లక్షలు ఉన్న స్థలాన్ని ఎకరానికి రూ.4 లక్షలు ఇచ్చి కొనుగోలు చేయడానికి కారణమేమిటని ప్రశ్నించారు. ఇది పెద్ద స్కాం అని అనుమానం వ్యక్తం చేశారు. అదే విధంగా 4వేలు మీటర్లు గ్రావెల్ రోడ్డుకు రూ.76లక్షలు జగనన్న కాలనీలో ఖర్చు చేయడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో గ్రామీణ ప్రాంతాల వారిని ఎంపిక చేసి అసలైన లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. నగర పంచాయతీలో వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. అవసరమైతే వార్డుల్లో స్వయంగా తానే పర్యటిస్తానని, రెండ్రోజులకు ఒక్కసారి అధికారులు కూడా తిరగాలని సూచించారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. అలాగే డంపింగ్ యార్డు సమస్యను కూడా పరిష్కరించాలని, టిడి పారాపురం వద్ద వివాదం ఉంటే వేరే చోట ఐదు ఎకరాలు స్థలాన్ని గుర్తించలేరా అని ప్రశ్నించారు. అదే విధంగా ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించాలని, రిఫర్‌లు లేకుండా వచ్చిన రోగులకు వీలైనంత వరకు ఇక్కడే సేవలందించాలని సూచించారు. ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు తోటపల్లి ఎడమ కాలువ ద్వారా నీరు పాలకొండకు అందేలా చూడాలన్నారు. ఆధునీకరణ పనులు అలస్యమవుతున్న కారణంగా తాత్కాలికంగా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ఐసిడిఎస్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ముందుగా ప్రజల్లో బాల్య వివాహాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, తహశీల్దారు వరహాలు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, మాజీ ఛైర్మన్ ప్రతినిధి పల్లా కొండలరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్‌కుమార్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి తన సొంతంగా రూ.50వేలు విరాళం ప్రకటించారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయకృష్ణ

27న ఐటిఐలో ప్రవేశానికి కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మిగిలిన సీట్లకు జూలై 27న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 24లోగా iti.ap.gov.in వెబ్‌సైట్‌కు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 25న ఆన్లైన్ చేసుకున్న అభ్యర్థులు మన్యం జిల్లాలో ఏదైనా ఐటిఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

జాబ్‌మేళాలో 97మంది ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో కెఎల్ గ్రూప్ అమెజాన్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 147 నిరుద్యోగ యువత హాజరు కాగా, 97 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూ ద్వారా క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపల్ ఎం.గోపాలకష్ణ మాట్లాడుతూ అమెజాన్ కెఎల్ గ్రూప్స్ మంచి సంస్థలన్నారు. ఇలాంటి జాబ్ మేళాలను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైటిసి మేనేజర్ వెంకటరమణ, ఐటిడిఎస్ సిబ్బంది సత్యనారాయణ అమెజాన్ కెఎల్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు

యుద్ధ ప్రాతిపదికన సాగు నీరందించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

పెదంకలాం ఆనకట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఖరీఫ్ సీజన్ ఆసన్నం కావడం తో పెద్ద అంకలం ఆనకట్టు ప్రధాన కాలువ ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా మరమ్మతులు పనులు చేసి సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను స్థానిక ఎమ్మెల్యే బి.విజయ చంద్ర ఆదేశించారు. మండలంలో సువర్ణముఖి నదిపై ఉన్న పెదఅంకలాం ఆనకట్టు, కాలువ పరిస్థితిని శనివారం ఆయన పరిశీలించారు. ప్రధాన కాలువలో అనేక సమస్యలున్నాయని పణుకువలస, అరసాడ, బలిజిపేట, పలగరకు చెందిన రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆనకట్ట వద్ద ఉన్న పరిస్థితి, ప్రధానకాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలపై ఇరిగేషన్ అధికారులతో ఆయన చర్చించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయం కాబట్టి, అలాగే వరి నాట్లు వేసుకునే సమయం వల్ల యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి సాగునీరు అందించాలని ఆయన ఆదేశించారు. అలాగే మరమ్మతు పనులకు కావాల్సిన నిధులపై నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రధాన కాలువ పరిధిలోని ఏడు కిలోమీటర్ల వరకు ఆయన కాలినడకన వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. గత ప్రభుత్వం ఇరిగేషన్‌పై నిర్లక్ష్యం చేయడం వల్లే కాలువలకు ఇటువంటి దుస్థితి నెలకొందన్నారు.

ప్రధాన కాలువ పరిధిలో ఉన్న పరిస్థితిని చూస్తే చాలా దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు తెలిపారు. ఉన్నతాధికారులతో ఆనకట్టు ప్రధాన కాలువ దుస్థితిపై సమీక్ష చేసి పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు సీతారాం, అరుకు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు బి.రవికుమార్, క్లస్టర్ ఇన్చార్జి గుల్ల బాబ్జీ, ఆర్ వేణు, నీటి పారుదల శాఖ డిఇ త్రిమూర్తులు రావు, ఇరిగేషన్ అధికారి కవిత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అధికారం వచ్చే వరకూ ఆక్రమణలు గుర్తుకు రాలేదా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజకీయం అంటే అధికారంలోవున్నా లేకున్నా ప్రజల తరపున పోరాడేది. ఇంకా చెప్పాలంటే ప్రజలకు సేవచేసేది. అలాగని పార్లమెంటరీ రాజకీయాలు అవసరం లేదని కాదు. కానీ, ప్రజాసమస్యల పట్ల స్పందించేందుకు, పాలకుల దోపిడీని నిలువరించేందుకు కేవలం అధికారం మాత్రమే ఉండాలనుకుంటే పొరపాటే. ఈ మాటకొస్తే రాజకీయాల్లోని లేనివారు కూడా చర్చకు వచ్చే అంశాలపై తమ వైఖరి కుండబద్ధలు కొట్టినట్టు తెలియజేస్తారు. వైసిపి కార్యాలయం వివాదం విషయంలో విజయనగరం ఎమ్మెల్యే, ఆమె అనుయాయులు, ఆ పార్టీ నాయకుల వైఖరి అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడే విజయనగరం రింగురోడ్డుకు ఆనుకుని దాసన్నపేటలో జిల్లా పార్టీ కార్యాలయాన్ని నిర్మించిన సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా టిడిపి అధికారంలోకి రావడంతో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆ కార్యాలయాన్ని సందర్శించి వైసిపిపై కీలక ఆరోపణలు చేశారు. అదితి వెంట జనసేన, బిజెపి నాయకులు కూడా ఉన్నారు. కార్యాలయ భవనం కోసం భూములు కబ్జాచేశారని, అనుమతులు కూడా తీసుకోకుండా నిర్మాణ పనులు చేపట్టారని అదితి చేసిన విమర్శ. ఇంతవరకు బాగానే ఉన్నా.... అసలు జిల్లా కేంద్రంలో హాట్‌కేక్ లాంటి రింగురోడ్డులో ఏకంగా మాన్సాస్ భూమి ఆక్రమించుకుంటే ఇన్నాళ్లు టిడిపి ఏమైపోయింది. ఎందుకు అడగలేదు. అందులోనూ మాన్సాస్ అంటే ఎమ్మెల్యే వారసత్వ ట్రస్ట్. అయినా సరే ఎందుకు నోరు మెదపలేదు? వైసిపి అధికారంలో ఉండడం వల్ల భయపడ్డారా? అప్పట్లో మనకెందుకు లే అనుకుంటూ రాజీపడ్డారా? అలాంటప్పుడెందుకు అంత ఉలుకుపాటు? ఇదీ అక్షరాలా జనం నోట వినిపిస్తున్న ప్రశ్నలు. ఇందుకు టిడిపి నాయకులు, ఎమ్మెల్యే అదితి సమాధానం చెప్పాలివుంది. నిజంగా టిడిపికి చిత్తశుద్ధి ఉంటే భూమిని కబ్జాచేసిన వారిపైనా, అధికార దుర్వినియోగానికి పాల్పడినవారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అందుకు టిడిపి సాహసిస్తుందా? జనం నుంచి వినిపిస్తున్న ధర్మ సందేహమిది. వాస్తవానికి వైసిపి అక్రమాలు నిజంగా బయటపెట్టి బోనులో నిలబెట్టాలనుకుంటే జగనన్న కాలనీలపేరిట సేకరించిన భూ వ్యవహారాలు పరిశీలిస్తే బోలెడన్ని అక్రమాలు బయటపడతాయి. ఇంకొంచెం ముందుకు వెళ్తే విజయనగరంలోనే అనేక చెరువులు మాయమయ్యాయి. ఇంకా చెప్పాలంటే దళితుల లబ్ధిపేరిట రెగ్యులైజేషన్‌కు వైసిపి ప్రభుత్వం చేసిన ఆర్డినెన్స్ ఓ భూదందా. ఫ్రీహోల్డ్ చేసిన భూములన్నీ వైసిపి నాయకుల చేతుల్లోకి వెళ్లాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అయితే ఏకంగా వైసిపికి చెందిన బడా నాయకులే అడ్వాన్సులు ఇచ్చి వశపర్చుకున్నారు. ఇవన్నీ బయటకు తీసి, ఆక్రమార్కుల చిట్టా బయటపెట్టి, అమాయక దళితులకు అండగా నిలబడేంత చిత్తశుద్ధి ఉందా? అన్నది పబ్లిక్ టాక్. ఇవేవీ చేయకుండా ఊరకే వైసిపిపై ఆరోపణలతో కాలక్షేపం చేస్తే ప్రజావిశ్వాసాన్ని కోల్పోవడం తప్ప టిడిపికి కలిసొచ్చే అవకాశమేమీ లేదని పలువురు విశ్లేషిస్తున్నారు. గతంలో వైసిపి రాష్ట్ర నాయకుడు విజయసాయిరెడ్డి, జిల్లాకు చెందిన అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ కూడా మాన్సాస్ లెక్కలు తేలుస్తామంటూ తుస్సుమనిపించారు. టిడిపి కూడా అటువంటి హడావుడే చేస్తోందని, ఇరు పార్టీల్లో ఓ స్పష్టమైన అవగాహనతోనే పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిపాటేనని జనం చర్చించుకుంటున్నారు. తాజాగా ఎమ్మెల్యే అదితిచేసిన ఆరోపణలు రుజువని నిరూపించి చర్యలు తీసుకునేవరకు వెళ్లకపోతే ప్రజల్లో చులకనైపోయే ప్రమాదం లేకపోలేదని సాక్షాత్తు టిడిపి నాయకుల నోటే వినిపిస్తోంది.

రోడ్డుకు అడ్డంగా లారీ బోల్తా

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా -ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. శనివారం వేకువ జామున మండలంలోని గుమ్మడ సమీపాన అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతిలో లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి రాయగడ వైపు పౌడర్ లోడుతో వెళ్తున్న లారీ శనివారం వేకువ జామున గోతులు వద్ద అదుపుతప్పి రోడ్డుకు అడ్డగా బోల్తా పడింది. దీంతో మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై నీలకంఠం స్పందించి తమ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మధ్యాహ్నం నుంచి బోల్తా పడిన లారీని తొలగించడంతో రహదారిపై ఏర్పడిన గోతుల్లో ఇబ్బందులు పడుతూ రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఏది ఏమైనా ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్న చిన్న గోతులు కూడా పెద్ద గోతులుగా ఏర్పడి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులు మరమ్మతులు చేస్తే తప్ప ప్రమాదాలు ఆగవని స్థానిక ప్రజలు అంటున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : సిపిఎం

ఆంధ్రా -ఒడిశా అంతరాష్ట్ర రహదారిపై ప్రస్తుతం భారీ గొయ్యిలు ఏర్పడడంతో ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం బోల్తా పడిన లారీ వద్ద వాహనదారులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నివేదికలు సిద్ధం చేయాలని చెప్పిందని, అయితే నివేదికలు పంపించి పనులు ప్రారంభించినప్పటికీ సమయం పట్టే అవకాశం ఉందని అన్నారు. ఈలోగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా మారే పరిస్థితి కనిపిస్తుందన్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసే లోపే రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గోతులను తక్షణమే కప్పి ప్రమాదాలను నివారించాలని కోరారు. తాత్కాలికంగా గోతులను కప్పితే కొంతవరకు ప్రమాదాలను ఆపవచ్చని అన్నారు. కార్యక్రమంలో వాహనదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఫ్లైఓవర్‌పై గొయ్యిలను కప్పుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సమస్యల పరిష్కారానికి తొలి అడుగు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర అడుగులు వేశారు. ఇందులో భాగంగా శనివారం ఆయన పట్టణంలో గల ఫ్లైఓవర్ మీద ఏర్పడిన గోతులతో పాటు, రహదారుల్లో ఏర్పడిన గోతులపై దృష్టి సారించారు. బైపాస్ రోడ్, ఫ్లై ఓవర్‌పై గోతులను ఎమ్మెల్యే పరిశీలించారు. వీటిపై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. ఈ గోతుల వల్ల పలువురు వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్న సందర్భాలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌కు గోతులకు మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారి పి.కిరణ్ కుమార్ పర్యవేక్షణలో గోతులకు మరమ్మతు పనులు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో ఫ్లైఓవర్‌పై రాకపోకలు సాగించే వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, పట్టణ టిడిపి అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరినాయుడు, నాయకులు సిరిపురపు భాస్కరరావు, కోలా మధు, పత్తిగుల్లి సత్యనారాయణ, సారికి గణేష్, సుంకర ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

సివిల్ సప్లై గోడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌ను శనివారం పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీ అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను తనిఖీ చేశామన్నారు. ఐసిడిఎస్, జిసిసి డిపోలకు సంబంధించిన స్టాకును పరిశీలించామన్నారు. గోడౌన్‌లో సరుకుల నిల్వలు, దస్త్రాల్లో పొందుపర్చిన వివరాల్లో ఎటువంటి వ్యత్యాసాల్లేవని, అన్నీ సక్రమంగా ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం సరుకుల పంపిణీలో ఎటువంటి మార్పులు ఉండవని తెలిపారు. ఆర్‌డిఒ వెంట తహాశీల్దార్ పి.బాల, విఆర్‌ఒ ప్రశాంత్, గోడౌన్ సూపరింటెండెంట్ పైడ్రాజు, పలువురు సేల్స్ మేన్లు ఉన్నారు.

గెడ్డపై నిర్మించిన ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

వరహాల గెడ్డపై ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని వరహాలగెడ్డ గట్టుపై నిర్మించిన ఆక్రమ కట్టడాలను మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు, సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రెటరీల పర్యవేక్షణలో మున్సిపల్ జెసిబితో తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి మాట్లాడుతూ వరహాలగెడ్డపై అక్రమ నిర్మాణాలు నిర్మించి, గట్టు భాగాన్ని ఆక్రమిస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే విజయ్ చంద్ర దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించినట్టు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే తొలగించడం జరుగుతుందని, నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన సమగ్ర ప్రతిపాదన లను అందజేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి జెసి ఎస్.ఎస్. శోభిక, ఐటి డిఎ పిఒ సి.విష్ణు చరణ్, వైద్య, ఆరోగ్య, ఐ సి డి ఎస్ అధికారులతో సి ఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) పనుల కల్పనకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వానికి సామాజిక బాధ్యతగా సహకారం అందించేందుకు ఎన్‌పిసిఐఎల్ భాగస్వామ్యంతో ప్రజలకు అత్యంత మేలు జరిగే మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ముందుకు వచ్చింద న్నారు. పరిధిలోని ఆయా ప్రాధాన్యతలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలను పంపించాలని స్పష్టం చేశారు. జిల్లాలో గర్భిణులకు వసతి గృహం, బ్లడ్ కంపోనెంట్ యూనిట్, హెచ్ బీ లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు మిషన్ లను ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిని వాగ్దేవి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ వెంటనే ప్రతిపాదనలను పంపించాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అగ్రకుల పెత్తందార్ల దాడిలో గాయపడిన పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులను సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గరుగుబిల్లి మండలం శివ్వాంలో దళితులపై దాడి చేసిన పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత మహిళలపై అనుచితంగా పెత్తందార్లు ప్రవర్తించారని ఆగ్రహించారు. ఒక దళిత మహిళ దుస్తులను చింపి వేశారని, ఆమె వీపుపై గాయమైందన్నారు. మరికొంత మంది దళితుల తలపైనా, శరీరంపై గాయాలయ్యాయని అన్నారు. పెత్తందార్లు కులం పేరుతో దూషించారని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు, క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా జి.వెంకటరమణ, బి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు తదితరులు ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని డిఐఇఒ మంజుల వీణ అన్నారు. శనివారం ఆమె స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల పనితీరు మెరుగుకు తగిన సూచనలు, సలహాలు చేసి, కళాశాలలో మెరుగైన విద్యా బోధన అందించాలని సూచించారు. అలాగే కళాశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఐఎఫ్పీ ప్యానల్స్ పనితీరును పరిశీలించి సూచనలు జారీ చేశారు. కళాశాలలో విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకులు పాఠ్యాంశాలపై దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలను రాబట్టాలని అన్నారు. అనంతరం అధ్యాపకులు మంజుల వీణను సత్కరించారు. ఆమె వెంట కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మ, అధ్యాపకులు ఉన్నారు.

మంత్రి దృష్టికి కార్మికుల సమస్యలు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి పట్టణంలో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తీసుకెళ్లారు. శనివారం ఉదయం మున్సిపల్ సమావేశానికి హాజరైన మంత్రి సంధ్యారాణికి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన కార్మికులు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కార్మికులు మున్సిపల్ కార్యాల యం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. జీతాలు చెల్లింపుల్లో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది జనవరికి సంబంధించిన వేతన బకాయి రూ.3వేలు చెల్లించలేదని చెప్పారు. ఫిబ్రవరి నెల జీతం బకాయి రూ.6వేలు చెల్లించ లేదన్నారు. డ్రైవర్ల జీతాల పెంపునకు సంబం ధించిన జిఒ అమలు చేయలేదని చెప్పారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని కౌన్సిల్ చేసిన తీర్మానం అమలు చేయలేదని చెప్పారు. కార్మికులు ఆందోళన చేసినప్పుడు అధికారులు ఎఒ కబుర్లు చెప్పి తప్పించుకుంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.రాము డు, టి.శంకర్, టి.రవి, టి.శ్రీను ఉన్నారు.

మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

వాలంటీర్ల వినతి

మున్సిపాలిటీలో తమకు రెండు నెలల జీతాలు చెల్లించలేదని వార్డు వాలంటీర్లు మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. మార్చి, ఏప్రిల్‌కు సంబంధించిన జీతాలు అన్ని చోట్లా చెల్లించారని, ఇక్కడ మాత్రం చెల్లించలేదని చెప్పారు. తమ ఉపాధి పోకుండా చూడాలని కోరారు.

మంత్రి దృష్టికి గిరిజన గురుకుల సమస్యలు

తమ సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ గిరిజన గురుకుల అధ్యాపక సంఘం నాయకులు మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 38 గిరిజన గురుకుల పాఠశాలలు వుంటే 7కాలేజీలకు మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు ఉన్నారని, వెంటనే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. గిరిజన గురుకుల జూనియర్ కళాశాల లను డిగ్రీ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయాలని, చాలా మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేస్తున్నారని చెప్పారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో గిరిజన గురుకుల అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పారయ్య, కోశాధికారి గణపతిరావు, వసంతరావు వున్నారు.

లంకెల చెరువులో ఆక్రమణల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని బాలగొడబ రెవెన్యూ పరిధిలోని వైకెఎం, శక్తి నగర్ కాలనీల వెనుక ఉన్న సర్వే నెంబర్ 15లో 50 ఎకరాల విస్తీర్ణం గల లంకెల చెరువులో యథేచ్ఛగా జరుగుతున్న ఆక్రమణలను శనివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను స్థానిక ప్రజాప్రతినిధుల అండతో ప్రోత్సహించారని దీనివల్ల కబ్జాదారులు రెచ్చిపోయి చెరువును దాదాపు పూర్తిగా ఆక్రమించుకునే పరిస్థితి ఏర్పడిం దని అన్నారు. దీనివల్ల బాల గొడబ ఆయకట్టుకు నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో బరితెగించి ఆక్రమణలు జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరించడం దారుణమని అన్నారు. కేవలం లంకెల చెరువునే కాకుండా నియోజకవర్గంలో చెరువులన్నింటినీ సర్వే చేయించి విస్తీర్ణాన్ని గుర్తించి, ఆక్రమణలను తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టరుకు సిఫార్సు చేస్తానని అన్నారు. వెంటనే లంకెల చెరువు విస్తీర్ణాన్ని గుర్తించి ఏ మేరకు ఆక్రమణలు జరిగిందో నివేదిక ఇవ్వాలని సర్వేయర్లను కోరారు. ఈ పరిశీలనలో టిడిపి నాయకులు బార్నాల సీతారాం పాల్గొన్నారు.

సంతృప్తినిచ్చిన ఉపాధ్యాయ వృత్తి

హెచ్‌ఎం జయంత్ రావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తన 36 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తి తనకెంతో సంతృప్తినిచ్చిందని మండలంలోని కోసింగి భద్ర గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎం పాలక జయంత్ రావు అన్నారు. ఆదివారం ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

నేను కురుపాం మండలం పి.లేవిడికి చెందిన పాలక నీలాంబరు, ఆరిక సోమమ్మ దంపతుల రెండో సంతానం నేను. 1నుండి 5 తరగతి వరకు ప్రాథమిక విద్య పి.లేవిడిలోనూ, హైస్కూల్ ఉన్నత విద్యను బత్తిలిలో అభ్యసించాను. 1988లో జోడుమానుగూడలో (సింగల్ టీచర్) ఉపాధ్యాయుడుగా నా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. గొల్లగానిగూడ, టోంపలపాడు, సీడిమనుగూడ, పోరండంగూడలో పనిచేస్తూ ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతిపై పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలకు వచ్చి సేవలందించాను. అనంతరం 2022న బదిలీపై కోసింగిభద్ర గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు వెళ్లి ఆదివారం ఉద్యోగ విరమణ పొందుతున్నాను. విద్యార్థులకు చదువుతో పాటు పాఠశాల పరిసరాల పచ్చదనం పట్ల అవగాహన కల్పించేలా ఎంతగానో కృషి చేశాను. పాఠశాల్లోనే అనేక రకాల పూల మొక్కలతో నందనవనంగా తీర్చిదిద్దాను. పాఠశాలల అభివృద్ధికి నావంతుగా ఎంతో కృషి చేశాను. నా వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు ఉపాధ్యాయులుగా, డాక్టర్లు, ఇంజనీర్లు, బ్యాంకు ఉద్యోగులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉంటూ నన్ను నేటికీ గౌరవించడం సంతోషంగా ఉంది.

డీలర్‌కు ఆథరైజ్డ్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జిఎం ప్రవీణ్

వాహన వినియోగదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ద్విచక్ర వాహన వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు పార్వతీపురం జిల్లా కేంద్రంలో తమ శాఖను ఏర్పాటు చేశామని వేణుగోపాల సుజుకి షోరూం జనరల్ మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. శనివారం పార్వతీపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన సుజుకి షోరూం శాఖను ఏరియా సేల్స్ మేనేజర్ పి.వంశీకృష్ణరెడ్డి, సర్వీసెస్ ఏరియా మేనేజర్ జి.రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు యాక్సెస్ 125, బర్గ్ మెన్, అవెన్యూ వంటి మోడళ్లను ఎక్కువగా ఆదరిస్తున్నారని అన్నారు. వీటికి సంబంధించిన వినియోగదారులు కూడా ఎక్కువగా ఉండడం వల్ల వారికి అందుబాటులో ఉండడం కోసం జిల్లా కేంద్రంలో నూతన శాఖను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ జి.అభిరామ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ శంకరరావు సిబ్బంది పాల్గొన్నారు.

డిడికి అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గురుకుల కళాశాల, పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని శనివారం డిడి కార్యాలయం ప్రాంగణంలో డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీలో కలిసిన గిరిజన గురుకులాల ఉపాధ్యాయుల పోస్టులను 11:43 మినహాయించాలని కోరారు. ఔట్సోర్సింగ్ విధానం నుంచి కాంట్రాక్ట్ జెఎల్‌గా, ఉపాధ్యాయులుగా సిఆర్‌పిలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. గత 15ఏళ్ల నుంచి గిరిజన గురుకులాలను నమ్మి తమ విధులను గిరిజన గురుకుల కళాశాల, పాఠశాలల్లో పనిచేస్తున్నామని అన్నారు. విధులు క్రమం తప్పకుండా పాటిస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిని ఇచ్చిన వారిలో కె.ఈశ్వరమ్మ, కల్యాణి, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని మనుమకొండ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కె.దామోదర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పిల్లలకు హిమోగ్లోబిన్, జ్వర పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, డయేరియా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. హ్యాండ్ వాష్ టెక్నిక్స్, వేడి నీళ్ల తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి విద్యార్థి పాటించాలని అన్నారు. మీ తరగతి గతులు, హాస్టల్ గదులను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు పిల్లలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం ఆమె తోటపల్లి వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి దేవస్థానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రస్తుతం ఆలయంలో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా నిధుల మంజూరుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వివి సూర్య నారాయణ, స్థానిక సర్పంచ్ ఆవాల సింహాచలం, టిడిపి నాయకులు, మర్రాపు పురుషోత్తంనాయుడు, అక్కేన మధుసూదనరావు, అంబటి తవిటి నాయుడు (రాంబాబు), కోట భరత్‌కుమార్ (సుమన్), మరడాన సింహాచలంనాయుడు, ముదిలిబాబు విజయ వాంకుశం, డొంకాడ రామకృష్ణ, ఆర్నిపల్లి గంగాధరనాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ సమస్య పరిష్కరించాలి

మండలంలోని చినగుడబలో నిర్వహిస్తున్న మైనింగ్ సమస్య పరిష్కరించాలని జనసేన ఇంచార్జ్ కద్రక మల్లేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. గ్రామ సమీపాన మైనింగ్ నిర్వహిస్తున్నందున కాలుష్యంతో పాటు పొలాలకు నష్టం జరుగుతుందని వివరించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ మైనింగ్ సమస్య గురించి తనకు తెలుసునని, దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మూడు గ్రామాలకు సంబంధించి రైతులు, పలువురు జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆదివాసీ జెఎసి

గుమ్మలక్ష్మీపురం : కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఆదివాసీ జెఎసి జిల్లా చైర్మన్, సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నిత్యం ఆదివాసీల సమస్యలపై స్పందించి ఆదివాసీల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అలాగే మరికొన్ని సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. రాబోయే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి చైర్మన్ కొండగొర్రి ధర్మారావు, వైస్ చైర్మన్ రోబ్బ లోవరాజు, దుక్క సీతారాం, ఇంటికుప్పల రామకృష్ణ, కోలక గౌరమ్మ, మల్లయ్య, ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రమై సీతానగరం బజారులో గోతులుగా మారిన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అధికారులకు ఆదేశించారు. శనివారం ఆయన రోడ్డు దుస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో గోతులుగా మారాయన్నారు. వెంటనే నీటిని తొలగించి ఎత్తు చేయించాలన్నారు. ఈ పనులకు రూ.35 లక్షలతో ప్రతిపాదనలు కూడా చేసినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. రోడ్డు పరిశీలనలో మండల టిడిపి అధ్యక్షులు పెంట సత్యనారాయణ, రౌతు వేణుగోపాలనాయుడు, మండల కార్యదర్శి బర్నాల సీతారాం, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్య, వైస్ ప్రెసిడెంట్ కె.అరవింద్, మండల నాయకులు ఎస్.హరి గోపాలరావు, తెంటు వెంకట అప్పలనాయుడు, బి.శ్రీనివాసరావు, పెద్దబ్బాయి, బలగ శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసరావు, తేలు చంద్రశేఖర్, ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఎస్సై ఎం.రాజేష్, ఆర్అండ్‌బి ఎఇ రామ్మోహన్‌రావు పలువురు పాల్గొన్నారు.

గోతులు పడ్డ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఎమ్మెల్యేలను కలిసిన ఎన్‌సిఎస్ సుగర్స్ కార్మికులు

మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబినాయన, బోనెల విజయ్ చంద్రను శనివారం కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలుపుతూ ఫ్యాక్టరీ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మలేరియా మందులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆస్పత్రికి 3వేల ఆర్సినెట్ ఇంజక్షన్లు అందుబాటులోకి వచ్చాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 27న 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన మలేరియాకు మందుల్లేవ్ అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక ఏరియా ఆసుపత్రికి 3వేల ఇంజక్షన్లు మంజూరు కాగా, మిగతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మలేరియా మందుల కోసం డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. వచ్చిన వెంటనే మిగతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా మలేరియా మందులు సరఫరా చేస్తారని తెలిసింది.

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - సీతానగరం

కొండవాగు ఆక్రమణలను తొలగించాలని తహాశీల్దార్ కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జోగింపేటలో కొండవాగు ఆక్రమణకు గురైందని సర్పంచ్ కె.సింహాచలం ఫిర్యాదు మేరకు శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాగు ఆక్రమణకు గురై ప్రజలు ఇబ్బందుల మేరకు ఆక్రమణలో తొలగించాలని తెలిపారు. లేనిచో శాఖా పరంగా తొలగించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, విఆర్ఓ శ్రీకాంత్, సర్పంచ్ కె.సింహాచలం, గ్రామ పెద్దలు, సర్వేలు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి - వీరఘట్టం

చేసిన సేవలే ఉద్యోగికి మంచి గుర్తింపునిస్తాయని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా ఉద్యోగ విరమణ పొందిన కొప్పర దుర్గారావు సన్మాన సభలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, తహాశీల్దారు కె.జయప్రకాష్, ఆర్ఐ లక్ష్మీనాయుడు, పలువురు విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

మక్కువ : మండలంలోని అన్ని పెన్షన్లు ఇంటి వద్దకే అందజేస్తామని ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు. సచివాలయ సిబ్బంది జులై 1న ఉదయాన్నే ప్రతి ఇంటికీ వెళ్లి పింఛన్ అందజేస్తూ రశీదు కూడా ఇస్తామన్నారు. ఏ ఒక్క లబ్ధిదారులు కూడా సచివాలయం వద్దకు వెళ్లకూడదని వారి ఇంటి వద్ద ఉంటూ సిబ్బందికి సహకరించాలని ఆయన తెలిపారు.

అధిక దిగుబడి సాధించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈ ఏడాది ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు ప్రణాళికలు వేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని కత్తుల కవిటిలో గల రైతు భరోసా కేంద్రంలో ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వ్యవసాయాధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి పంటల సాగు చేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని, తద్వారా లాభదాయకంగా పొందవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి, ఎఒ జె.సౌజన్య, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాను

బైక్ బోల్తా ; యువకుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బైకుపై వేగంగా వెళ్తూ అదుపుతప్పి తీవ్ర గాయాలు పాలైన యువకుడు భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. శనివారం సాయంత్రం కురుపాం మండలం లండగొర్లికి చెందిన భాను అనే యువకుడు మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై శరవేగంతో గుమ్మలక్ష్మీపురం గ్రామానికి వస్తూ ఎల్విన్‌పేట కూడలి సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టబోయి రోడ్డు పక్కనే పడిపోయాడు. అయితే యువకుడు కుడి వైపు మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొంతమంది యువకులు తీసుకువెళ్లి ప్రథమ చికిత్సను అందించారు. యువకుని పరిస్థితి విషమంగా ఉండడంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అయితే ఆ యువకునికి పెద్ద ప్రమాదం తప్పిందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని శివరాంపురం వేగావతి నదీ పరీవాహక ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఇబి సిఐ ఎం.వెంకటరావు, ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో శనివారం పట్టుకొన్నారు. ట్రాక్టర్లు నడుపుతున్న డ్రైవర్లు కనకల మణికంఠ, బూస నరేంద్రను అదుపులోకి తీసుకొని ఇసుకతో ఉన్న ట్రాక్టర్లను సాలూరులో రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. రూరల్ పోలీసులు సంబంధిత ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు.